క్లుప్తంగా

చేతి వృత్తుల్లో నైపుణ్య శిక్షణ

రాయచోటి అర్బన్: వివిధ రకాల చేతి వృత్తిలో నైపుణ్య శిక్షణ పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మెప్మా పట్టణ అధికారి అబ్బాస్ అలీ ఓ ప్రకటనలో కోరారు. కార్పెంటర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, గీజర్, టీవి, రిఫ్రిజరేటర్, వాషింగ్ మెషిన్ మరమ్మతులతోపాటు, పెయింటర్, బ్యూటీషియన్ (పురుషులు, స్త్రీలు) సేవలలో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. మెప్మా ఆధ్వర్యంలో ఎన్ఎస్‌డీసీ ద్వారా ఇచ్చే ఈ శిక్షణ అనంతరం సర్టిఫికెట్ పొందినవారికి జీవనోపాధి కల్పిస్తారన్నారు. ఆసక్తిగల వారంతా ఈ నెల 26వతేదీ నుంచి 30వ తేదీలోపు బస్టాండులోని మెప్మా కార్యాలయంలో తమ వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. దరఖాస్తుతోపాటు తమ ఆధార్, రేషన్, పాన్ కార్డుతోపాటు బ్యాంకు పాసు బుక్ నకలు జతపరచాలని కోరారు. మరింత సమాచారం కోసం కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సోలార్ లైట్ ట్రాప్స్ పంపిణీ


సోలార్ లైట్ ట్రాప్స్ పంపిణీ చేస్తున్న సిబ్బంది

సంబేపల్లి: ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రైతులకు సోలార్ లైట్ ట్రాప్స్ గురువారం పంపిణీ చేశారు. ఐసీఐసీఐ సంస్థ అధికారులు మాట్లాడుతూ మండలంలోని గురిగింజకుంటలో రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గించేందుకు సోలార్ ట్రాప్స్, బిట్టరీ స్ప్రేర్స్ బయో ఇన్‌పుట్స్, ఉపాధి పరికరాలు ఇచ్చినట్లు తెలిపారు. భూమి లేనివారికి నాటుకోళ్లు పంపిణీ చేస్తున్నామని, రైతుల పొలాల్లో ఇంకుడు గుంతలు, చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, సునీత, వెంకటకుమార్, ధరణేశ్వరి, మధుసూదన్, రైతులు పాల్గొన్నారు.

వెంకటరమణ సేవలు మరువలేనివి


వెంకటరమణ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లి: అంచల వెంకటరమణ సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మండలంలోని బొగ్గులవారిపల్లెలో సర్పంచ్ రామచంద్ర తండ్రి వెంకటరమణ మృతి చెందడంతో స్థానిక నాయకులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మంచి తనానికి మారుపేరుగా నిలిచి ప్రజల హృదయాలలో వెంకటరమణ స్థిరంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, చిదంబరంరెడ్డి, ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఉదయకుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకట్రమామిరెడ్డి, అమరనాథ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, అన్నారెడ్డి, రవీంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రైతు సంఘం నూతన కమిటీ ఏర్పాటు


నూతనంగా ఎంపికైన సభ్యులు

రాయచోటి అర్బన్: ఏపీ రైతు సంఘం రాయచోటి నియోజకవర్గ స్థాయి కమిటీని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి అధ్యక్షతన గురువారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా వల్లమూడి హరినాథ నాయుడు, గౌరవాధ్యక్షుడిగా భాస్కరరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యండపల్లె బాలక్రిష్ణారెడ్డి, సహాయ కార్యదర్శిగా సుధాకర్, ప్రచార కార్యదర్శిగా ఫరీద్‌బాబు, కార్యనిర్వహణ కార్యదర్శిగా జంగాల లక్ష్మిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి, ఆంజనేయులు, డాక్టర్ కెవీఎస్.నాయుడు, సహాయ కార్యదర్శిగా వెంకటరమణ ఎన్నికయ్యారు.

దరఖాస్తుల ఆహ్వానం

వీరబల్లి: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరస్వతమ్మ తెలిపారు. వీరబల్లి పంచాయతీలోని ఈడిగపల్లి ఆయా(బీసీ), ఎంకె.వడ్డిపల్లి ఆయా(బీసీ), బలిజపల్లి ఆయా(ఓసీ), కమ్మపల్లి అంగన్‌వాడీ కార్యకర్త(ఓసి), పెద్దవీడు పెద్దమాదిగపల్లి ఆయా(వీహెచ్) స్థానాలు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా పోస్టులకు ఈ నెల 24వ తేదీ నుంచి జనవరి 2వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. మరిన్ని వివరాల కోసం సుండుపల్లి ప్రాజెక్టు ఆఫీసులో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

రామాపురం మండలంలో..

రామాపురం: లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ పద్మావతమ్మ తెలిపారు. మండలంలోని బాలిరెడ్డిగారిపల్లెలో అంగన్‌వాడీ కార్యకర్త(ఓసీ), ఏకిలపల్లెలో అంగన్‌వాడీ సహాయకురాలు(బీసీ)పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ప్రమాదం అంచున.. శిబ్యాల వంతెన

రాయచోటి–సుండుపల్లె రోడ్డులోని శిబ్యాల వంకపై కల్వర్టు కూలేందుకు సిద్ధంగా ఉంది. అదే జరిగితే ప్రమాదం ఎప్పుడైనా జరగవచ్చునని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బ్రిటీష్ వాళ్లు నిర్మించిన వంతె కావడం, కల్వర్టు మధ్యలో రంధ్రం పడడంతో శిథిలావస్థలో ఉంది. ప్రస్తుతం మట్టితో కప్పి రాకపోకలు జరుపుతున్న ప్రయాణికులు క్షణ క్షణం భయపడుతున్నారు.

- కూలేందుకు సిద్ధమైన కల్వర్టు
- ఆగిన వంతెన నిర్మాణాలు
- భయంగా ప్రయాణికుల రాకపోకలు


శిబ్యాల వంతెనపై ఒక వాహనం మాత్రమే వెళ్తుందంతే

రాయచోటి టౌన్: రాయచోటి నుంచి సుండుపల్లె, రాయవరం, పింఛా వరకు అనేక ఆర్టీసీ బస్సులతో పాటు కార్లు, జీపులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల ద్వారా వందలాది జనం ప్రయాణం సాగిస్తుంటారు. శిబ్యాల కస్పా వద్ద ఓ వంక పై వంద సంవత్సరాల క్రితం చిన్న ఇరుకైన వంతెన నిర్మించారు. పురాతన కట్టడం కావడం.. వాహనాల రద్దీ పెరగడం.. ప్రయాణాలు ఎక్కువ కావడంతో ఇటీవల వంతెన కాస్త బీటలు మారింది. సింగిల్ రోడ్డు కావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

రూ.35 కోట్లు కేటాయించినా...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాయచోటి నుంచి బైరాగి గుట్ట వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.35 కోట్ల నిధులు విడుదల చేసింది. రోడ్డు నిర్మాణంలో భాగంగానే ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని సద్దుకూళ్ల వంక, శిబ్యాల వంకపై వంతెన నిర్మించేందుకు అనుమతులు మంజూరు చేసింది. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చూస్తూనే శిబ్యాల వంకపై వంతెన నిర్మాణానికి పెద్ద దిమ్మెలు ఏర్పాటు చేశారు. ఇంతలోనే ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి నేటి వరకూ ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయి.

వంతెన మధ్యలో రంధ్రం

శిబ్యాల వంకపై వంతెన మీద వేలాది వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. కల్వర్టు మధ్యలో రంధ్రం పడడంతో దానిని కప్పి పుచ్చడానికి మట్టి కుప్పగా పోశారు. అసలే ఇరుకైన రోడ్డు కావడం, మట్టిని పోయడంతో జనం వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. పెద్ద వాహనం వెళ్తే మరో ద్విచక్రవాహనం వెళ్లడానికి కూడా వీలు లేకుండా ఉంది. వానలు కురవడంతో పూర్తిగా బురద చేరింది. పర్యవేక్షించాల్సిన అధికారులు వదిలేయడంతో ప్రమాదం అంచున నిలిచింది.

పొలం పోతున్నా.. రోడ్డు వేయమన్నా


శిబ్యాల వంకపై నిర్మాణాలు చేపడితే నా పొలం కొంత భాగం రోడ్డు విస్తరణలో పోతుంది. అయినా అందరి సౌకర్యార్థం నేను రోడ్డు వేయడానికి ఒప్పుకొన్నాను. ఇప్పటివరకూ వేసిన దిమ్మెలపై రోడ్డు పనులు ఆగిపోయాయి. అధికారులు త్వరగా చర్యలు తీసుకొని రోడ్డు వేయాలని కోరుకొంటున్నా.

– బండి రమణ, శిబ్యాల

స్కూటర్‌పై వెళ్లాలంటే భయమేస్తోంది


శిబ్యాల వంకపై నిర్మించిన పాత కల్వర్ట్‌పై స్కూటర్‌పై వెళ్లాంటే భయమేస్తోంది. అంతా బురదగా మారి జారుతోంది. మధ్యలో పెద్ద మట్టి దిబ్బ ఉంది. అటుగా మరో స్కూటర్ కానీ...మరో వాహనం కానీ వస్తే స్కూటర్‌ను ఆపుకోలేము. వంతెన శిథిలమవడంతో ప్రమాదంగా మారింది. వెంటనే నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది.

– జబ్బు మహేష్, శిబ్యాల

కూటమి ప్రభుత్వం పూర్తిచేయాలి


గత ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులు చేపట్టినా ఎన్నికలు రావడంతో బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకొని రోడ్డు విస్తరణ పనులు చేయడంతోపాటు వంతెన నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి. ఆ దారిలో వెళ్లాలన్నా.....రావాలన్నా ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. కల్వర్టు కూలేందుకు సిద్ధంగా ఉంది.

– యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, రాయచోటి

రెవెన్యూ సదస్సుల్లో సమస్యలు పరిష్కరిస్తాం

పుల్లంపేట: రెవెన్యూ సదస్సులలో సమర్పించిన వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తహసీల్దారు అరవింద కిషోర్ పేర్కొన్నారు. మండలంలోని అప్పరాజుపేట గ్రామంలో ఉప సర్పంచ్ ముస్తాక్ ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో 32 వినతులు అందాయని, వాటిని ఆయా అధికారులకు బదిలీ చేసి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుశీల్‌కుమార్, సర్వేయర్ శ్రీరాములు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని బీకేఎంయూ నియోజకవర్గ కార్యదర్శి ఎం.జయరామయ్య కోరారు. మండలంలోని బాలిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జయరామయ్య మాట్లాడుతూ బాలాజీనగర్, శివాజీ నగర్ ఎస్టీ కాలనీల్లో 70 కుటుంబాల పేదలు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేశారన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి వారికి న్యాయం చేయాలని తహసీల్దార్ శ్రీధర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లిక, వెంకటరమణ, వెలుగు సుబ్బయ్య, రేవతి, తదితరులు పాల్గొన్నారు.


దిగువగొట్టివీడు సభలో పాల్గొన్న అధికారులు


అప్పారాజుపేటలో సదస్సులో అధికారులు

చిన్నమండెం: మండలంలోని దిగువగొట్టివీడు గ్రామంలో రెవెన్యూ సదస్సులు గురు వారం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి చంద్రానాయక్, తహసీల్దారు నరసింహులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీటీ రెడ్డిబాబు, సర్వేయర్ శ్యామల, రెవెన్యూ సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

జనవరి 4న రంగనాథస్వామి కల్యాణం

నందలూరు: అన్నమయ్య, రాజంపేట–ఆండాల్ భక్త సేవా సంఘం ఆధ్వర్యంలో గోదాదేవి, మహాలక్ష్మీదేవి సమేత ప్రసన్న రంగనాథస్వామి కళ్యాణం 2025 జనవరి, 4న నిర్వహించనున్నారు. రాజంపేట బైపాస్ రోడ్డులోని కళాంజలి గార్డెన్స్‌లో జరిగే ఈ కార్యక్రమ పోస్టర్లను స్థానిక సౌమ్యనాథస్వామి ఆలయంలో భక్తులు గురువారం ఆవిష్కరించారు. 4న ఉదయం గోపూజ, తులసీపూజ, విష్ణు సహస్ర నామ పారాయణం, స్వామి, అమ్మవారికి ఎదుర్కోలు ఉత్సవం ఉంటాయి. ఉదయం 10.45 గంటల నుంచి గోదా, మహాలక్ష్మీ సమేత రంగనాథస్వామి కళ్యాణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పెళ్లి కాని యువకులకు సత్వర వివాహం జరిగాలని కోరుతూ కళ్యాణ వేదిక వద్ద కళ్యాణ కంకణములు ఇవ్వనున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆధ్యాత్మిక గాయకులు గురుశ్రీ వెంకటేశ్వర్లు, కోటపాటి గోవిందదాసు బృందం అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించనున్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న భక్తులు

పేదల నాయకుడు వంగవీటి


నివాళులర్పిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్: పేద, బలహీన వర్గాల అభ్యున్నతికి తపించిన ప్రజా నాయకుడు వంగవీటి మోహనరంగ అని కాపు నాయకులు పేర్కొన్నారు. వంగవీటి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని మార్కెట్ కూడలి ప్రధాన రహదారిలోఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి నాయకుడికి వంగవీటి మోహనరంగ ఆదర్శ నీయుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్.రమేష్, మందల నాగేంద్ర, హేమరాజ్, శ్రీకారం మస్తాన్, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

అర్‌అండ్‌బీ స్థలం పరిశీలన

గాలివీడు: ఆర్‌అండ్‌బీ అధికారులు సమస్యను చక్కదిద్దే పనిలో పడ్డారు. కలెక్టర్ ఆదేశాలతో రేకుల షెడ్లు తొలగించిన స్థలంలో ఏఈ ధర్మారెడ్డి, సిబ్బంది గురువారం హద్దులు నిర్ణయించుకునే పనిలో పడ్డారు. అయతే ఆర్‌అండ్‌బీ స్థలంలో బౌండరీ ఏర్పాటు చేస్తారా? కాంప్లెక్స్ నిర్మాణం పనులు చేపడతారా? అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. అయితే మరిన్ని నిర్మాణాలు తొలగించకపోవడం పట్ల పలు విమర్శలకు తావిస్తోంది.

శ్రామికుల పక్షాన ఉద్యమాలు చేశాం

రాయచోటి అర్బన్: చివరి వరకు పేదలు, శ్రామికుల పక్షాన పోరాటం చేసేది సీపీఐ మాత్రమేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు అన్నారు. సీపీఐ శత వార్షికోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వాసుపత్రి గేటు వద్ద గురువారం సీపీఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పిలుపునిచ్చిన ఏకైక పార్టీ తమదే అన్నారు. దున్నే వారికే భూమి నినాదంతో వేలాది మందికి భూ పంపిణీ చేసిన ఘనత తమపార్టీకే దక్కుతుందన్నారు. బీజేపీ మతోన్మాత నినాదంతో ముందుకెళ్లా ప్రజలను భయపెడుతోందన్నారు. కూటమి ప్రభుత్వం రూ.15,484 కోట్ల విద్యుత్తు చార్జీల భారాన్ని ప్రజలపై మోపుతోందన్నా రు. ట్రూ అప్ చార్జీల పేరిట మరో రూ.6,072 కోట్లు, సర్‌ఛార్జీల పేరిట మరో రూ.9412 కోట్ల భారాన్ని ప్రజలపై మోపుతోందంటూ మండిపడ్డారు. పెంచిన చార్జీలను ఉపసంహరించుకునే వరకు తమ పార్టీ పోరాడుతుమందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుమిత్ర, కోటేశ్వరరావు, సుధీర్‌కుమార్, శ్రీనివాసులు, జె.వెంకటేష్, రంగారెడ్డి, వెంకటరమణ, జగన్‌బాబు, ఆంజనేయులు, ఓబులేసు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.


జెండా ఎగురవేస్తున్న జిల్లా కార్యదర్శి నరసింహులు, కార్యకర్తలు

బలహీన వర్గాల కోసం.. సీపీఐ పోరాటం


లక్కిరెడ్డిపల్లి: కార్యక్రమంలో సీపీఐ నాయకులు


ఓబులవారిపల్లెలో


గాలివీడు: సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో

ఓబులవారిపల్లె: దేశంలోని బలహీన వర్గాల పక్షాన పోరాడడమే సీపీఐ లక్ష్యమని మండల సీపీఐ కార్యదర్శి చింతలపూడి నాగమ్మ అన్నారు. సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చిన్నఓరంపాడు, కొర్లకుంట గ్రామాల్లో ఆ పార్టీ జెండా ఎగురవేశారు. రైల్వేకోడూరు ఏరియా కార్యదర్శి మోడి శివయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో సీపీఐ కీలకపాత్ర పోషించడమే గాక, ప్రజాస్వామ్య రక్షణకు వీరోచితమైన పోరాటం చేసిందన్నారు. భూకబ్జాలు అడ్డుకుంటూ ఇల్లు, భూములు లేదని పేదలకు న్యాయం జరిగేలా సీపీఐ పోరాటం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య రైల్వేకోడూరు ఏరియా కార్యదర్శి కృష్ణవేణి, డిహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దారులనాగేశ్వరరావు, దారుల సుధాకర్, వెంకటరామిరెడ్డి, దుర్గాలక్ష్మీ, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు: సీపీఐ వందో ఆవిర్భావ దినోత్సవం వేడుక గాలివీడులో ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు పార్టీ జెండా విష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భుక్తి కోసం పీడిత ప్రజల విముక్తి కోసం పార్టీ అనేక పోరాటాలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జక్కుల వెంకటేష్, పురుం కృష్ణమూర్తి, భాస్కర్ యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి: స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టు యోధులు అనేక మంది త్యాగాలు చేశారని, జైలుకెళ్లారని, ప్రాణాలుసైతం తృణప్రాయంగా అర్పించారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 100వ ఆవిర్భావ దినోత్సవం వేడుక లక్కిరెడ్డిపల్లిలో గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన శ్రీనివాసులు మాట్లాడుతూ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పిలుపునిచ్చిన ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. కష్టజీవుల సమస్యలపై నిరంతరం ఉద్యమాలు చేస్తోందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు కె.ఓబులేసు, జగదీష్, గంగయ్య, ప్రమీల, ఓబులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు చార్జీలపై పోరు బాట


ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు విద్యుత్తు చార్జీల పెంపుపై రాజంపేట నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ పోరు బాట తలపెట్టామని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు రాజంపేట పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి పాత బస్టాండు మీదుగా ర్యాలీ చేపడతామని తెలిపారు. కోడూరు రోడ్డులోరి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తరలిరావాలని అమర్‌నాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు.

పోరుబాటను విజయవంతం చేయాలి

సంబేపల్లె: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రంలో నిర్వహించే పోరు బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ డీసీఎంఎస్ చైర్మెన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యుత్తు ఛార్జీల భారం మోపిందని దీనికి నిరసనగా పోరుబాట నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

నిరసన తెలిపేందుకు తరలిరండి

రామాపురం: విద్యుత్తు చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ చేపట్టిన నిరసన కార్యక్రమానికి ప్రజలు తరలి రావాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గడికోట జనార్దన్‌రెడ్డి కోరారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం రాయచోటి విద్యుత్తు కార్యాలయం ఎదురుగా నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని 13 పంచాయితీల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు రావాలన్నారు.

రైతులు, పేదలకు అండగా వైఎస్సార్‌సీపీ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్: పేదలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పోరుబాట చేపట్టిందని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో గురువారం ఆయన చర్చించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్తు ఛార్జీల భారం మోపిన కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు చేపట్టిన వైఎస్సార్‌సీపీ పోరుబాటను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అన్ని గ్రామాల నుంచి ప్రజలుపాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామిరెడ్డి ధ్వజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

30 అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా

రాయచోటి అర్బన్: బీఆర్.అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా ఈ నెల 30న రాయచోటి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యదర్శి పియల్.నరసింహులు, సీపీఐ(ఎంఎల్) జిల్లానేత ఎం.విశ్వనాథం తెలిపారు. పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను గాలికి వదలేసిందని, సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేసిందని ఆరోపించారు. మహిళలు, కూలీలు, రైతులు, వ్యాపారులు, విద్యార్థులతోపాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడంలో కూటమి ప్రభుత్వం ముందు వరుసలో ఉందన్నారు. ఈ నెల 30న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహింప తలపెట్టిన నిరసన కార్యక్రమంలో కార్మికులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సుమిత్రమ్మ, పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

ధనికుల భవంతులు ఎందుకు తొలగించలేదు

గాలివీడు: ఆర్‌అండ్‌బీ స్థలంలో నిరుపేదల రేకుల షెడ్లు గంటల వ్యవధిలో తొలగించిన అధికారులు ధనికుల భవంతులు ఎందుకు తొలగించడం లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు ప్రశ్నించారు. స్థానిక సీపీఐ నాయకులతో కలసి పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలోని వివాదాస్పద ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ తొలగింపు వెనుక రాజకీయ శక్తులు ఉన్నాయా? అధికారులు అమ్ముడుపోయారా? అంటూ ధ్వజమెత్తారు. జిల్లా కలెక్టర్ స్పందించి ధనవంతుల భవనాలను తొలగించి మొత్తం 1.80 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. నిరుపేదలకు గూడు లేకుండా చేసిన అధికారులు వెంటనే ప్రత్యామ్నాయం చూపకపోతే రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జక్కుల వెంకటేష్, పురుం కృష్ణమూర్తి, భాస్కర్ యాదవ్, అంజి, జగన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.


నిరసస వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

రూ.2100 చెల్లిస్తే మామిడి పంటకు బీమా

సిద్దవటం: మామిడి పంట సాగు చేసే రైతులు ఎకరాకు రూ. 2,100 చెల్లిస్తే బీమా వర్తిస్తుందని జ్యోతి రైతు సేవా కేంద్రం ఉద్యాన ,సహాయకులు శ్రీనాథ్ తెలిపారు. సిద్దవటం మండలం జ్యోతి గ్రామంలో మామిడి పంటను గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబరు 31వ తేదీలోపు బీమా ప్రీమియం చెల్లిస్తే.. వచ్చే ఏడాది మే 31వ తేదీ వరకు బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ మధ్య కాలంలో అధిక వర్షం, గాలిలో తేమశాతం , వాతావరణ వ్యత్యాసం, అధిక గాలులతో పంట నష్టం జరిగితే బీమా మొత్తం ఇస్తారన్నారు. మామిడి పంట సాగు చేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, పట్టాదారు పాసు పుస్తకం రైతు సేవా కేంద్రంలో ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.


రైతులకు బీమా గురించి వివరిస్తున్న శ్రీనాథ్

● చినుకు పడితే చిత్తడి



మండలంలోని దిగువసిద్దవరం దళితవాడ రోడ్డు చినుకు పడితే చాలు చిత్తడిగా మారుతోంది. దళితవాడ వరకు ఉన్న ఈ రోడ్డు బురదమయం కావడంతో వాహనాలు వెళ్లేందుకు వీలులేకుండా పోతోంది. చాలామంది రోడ్డు పక్కన వాహనాలు ఉంచి దళిత వాడకు నడుచుకుంటూ చేరుకోవాల్సి వస్తోంది. మండల కేంద్రానికి రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న ఈ రోడ్డును పాలకులు, నాయకులు పట్టించుకోవడం లేదు. – పెనగలూరు

రేపు వేంకటేశుడి కల్యాణం

రాజంపేట టౌన్: పట్టణంలోని ఏబీ చంద్రారెడ్డి గార్డెన్స్‌లో శనివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 3.35 గంటలకు గీతాపారాయణం, 4.15కు విష్ణు సహస్ర నామం, 4.45కు అన్నమయ్య సంకీర్తన, 5 గంటలకు శ్రీవారి కోలాటం, కూచిపూడి నృత్యం ఉంటాయని తెలిపారు.